# స్వచ్ఛ పురస్కార శోభితం!

- స్వచ్ఛవిద్యాలయం అవార్డుకు అనంత
- 21న ప్రదానం చేయనున్న మోదీ



పంగల్ రోడ్డులోని పాఠశాలలో స్వచ్ఛ మరుగుదొడ్డి

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** స్వచ్ఛ విద్యాలయం పురస్కారంలో మనమే అగ్రస్థానంలో నిలిచాం. ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ అంశాల్లో దేశీయంగా వివిధ రాష్ట్రాలు పోటీ పడ్డాయి. నవ్యాంధ్ర నుంచి అనంతపురం, విశాఖపట్నం తుది వరకు పోటీపడ్డాయి. చివరకు అనంత భారత 'స్వచ్ఛ విద్యాలయం' అవార్డుకు ఎంపికైంది. ఈమేరకు ప్రధాని కార్యాలయం నుంచి కలెక్టరు శశిధర్, జిల్లా విద్యాధికారి అంజయ్యకు పిలుపు వచ్చింది. ఈనెల 21న ప్రధాని మోదీ చేతుల మీదుగా వీరు పురస్కారం అందుకోనున్నారు. ఈమేరకు జిల్లా విద్యాధికారి అంజయ్య సోమవారం రాత్రి దిల్లీకి బయలుదేరారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టరు వెళతారా వెళ్లరా అనేది ఇంకా తెలియలేదు. అనంతపురం జిల్లా స్వచ్ఛ విద్యాలయం అవార్డు రావడానికి అనుకూలించిన పరిస్థితులపై 'న్యూస్‌టుడే' కథనం.

రాజస్థాన్‌లోని జైసల్మేర్ తర్వాత అతి తక్కువ వర్షపాతం నమోదవుతున్న జిల్లాగా చరిత్ర పుటలోకి ఎక్కింది. ఇలాంటి జిల్లాలో కూడా స్వచ్ఛ విద్యాలయం కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించడంలో సర్వశిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ), విద్యాశాఖపై కలెక్టరు ప్రత్యేక చొరవ చూపారు. ఎప్పటికప్పుడు మరుగుదొడ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించారు. వివిధ బహుళజాతి కంపెనీలు, పెద్ద సంస్థలతో మాట్లాడి మరుగుదొడ్ల నిర్మాణాలపై శ్రద్ధ చూపడంతో ఆశించిన లక్ష్యం అందుకుంది. మార్చిలో అనంతలో అమలు అవుతున్న స్వచ్ఛ విద్యాలయంపై దిల్లీలోని ప్రధాని కార్యాలయం నుంచి వచ్చిన

మిగతా 7లో

# స్వచ్ఛ పురస్కార శోభితం!

**(మొదటి పేజీ తరువాయి)** ప్రతినిధి బృందం సైతం ప్రశంసలు ఇచ్చింది.

## అనంతకే అగ్రస్థానం..

జిల్లాలోని వివిధ విద్యాలయాల్లో అరకొర తాగు నీరు ఉన్నా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి ఆశించిన మేరకు నీటి సౌకర్యాన్ని కల్పించడంలో సఫలం అవుతున్నారు. జిల్లాలో స్వచ్ఛభారత్ అమలైన అనంతరం ఇప్పటి వరకు మొత్తం 3,855 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ నిధులతోపాటు దేశీయంగా ప్రముఖ సంస్థలు సైతం మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు వచ్చాయి. అనంతపురం జిల్లాలో ఎస్ఎస్ఏతో పాటు మరో 22 సంస్థలు మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాయి.

## పెరిగిన విద్యార్థుల హాజరు...

జిల్లాలో మొత్తం 3.68 లక్షల మంది విద్యార్థులు మరుగుదొడ్లు వినియోగించుకుంటున్నారు. ప్రాథమిక 2,774, ప్రాథమికోన్నత 595, జిల్లా పరిషత్తు 608 పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నాయి. ఇందులో బాలికలే ప్రత్యేకంగా 1.86 లక్షల మంది ఉన్నారు. గతంలో పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో హాజరు శాతం తక్కువగా ఉండటంతో పాటు విద్యార్థుల నమోదు తగ్గింది. మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టక ముందు బాలికల హాజరు శాతం కేవలం 91 శాతం ఉండగా తర్వాత 97శాతానికి పెరిగినట్లు గుర్తించారు. పాఠశాలల్లో మొత్తం 3,924 నిర్మాణాలు చేపట్టగా కేవలం స్వచ్ఛభారత్ లోనే ఏకంగా 2,202 మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ప్రధానంగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రతి మరుగుదొడ్డి రూ.2.25 లక్షలతో మొత్తం 646 చేపట్టిన నిర్మాణాలను చూసి దిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం సైతం అబ్బురం అని కితాబు ఇచ్చింది. స్వచ్ఛ విద్యాలయం పథకంలో భాగంగా 1,654 పాఠశాలల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించారు. విద్యార్థుల అనుభవాలు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుల అనుభవాలను ప్రాతిపదికన తీసుకొని అనంత స్వచ్ఛవిద్యాలయం ఎంపికకు మార్గం సుగమమైంది.